




పాలజంగిడి, ఘటాలను ఊరేగింపుగా తీసుకెళ్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు, ప్రజలు

ఇప్పలపోలమ్మకు తొలిపూజ

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్

పార్వతీపురం గ్రామదేవత ఇప్పలపోలమ్మకు తొలిపూజను పార్వతీపురం రాజ వంశస్తులు బుధవారం నిర్వహించారు. అమ్మవారి పాల జంగిడితోపాటు ఘటాలను గుడి నుంచి ప్రధాన రహదారి మీదుగా ఊరేగింపుగా తీసుకెళ్లి రాజుగారి కోటలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గుడికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమానికి పట్టణ ప్రజలు భారీగా హాజరయ్యారు.

మళ్లీ మన్యమే టాప్

టెన్త్ ఫలితాల్లో పార్వతీపురం మన్యం జిల్లా హ్యాట్రిక్

పదో తరగతి ఫలితాల్లో పార్వతీపురం మన్యం జిల్లా జైత్రయాత్ర కొనసాగుతోంది. మన్యం జిల్లా ఆవిర్భావం నుంచి వరుసగా మూడేళ్ల పాటు రాష్ట్ర స్థాయిలో మొదటి స్థానంలో నిలిచింది. హ్యాట్రిక్ విజయాలను సాధించింది. జిల్లాలో అన్ని యాజమాన్య పాఠశాలల్లోని విద్యార్థులు రికార్డు స్థాయిలో సత్తాచాటారు. బాలికలు ఎక్కువ మార్కులు సాధించి తమ హవాను కొనసాగించారు.

ప్రజాశక్తి-పార్వతీపురం రూరల్



కనకాల కనిష్క
593 మార్కులు



ఎస్.కీర్తి
592 మార్కులు

పార్వతీపురం మన్యం జిల్లాలో ఈ ఏడాది మొత్తం 10,286 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలకు హాజరయ్యారు. బుధవారం వెలువడిన ఫలితాల్లో 9,659 (93.90 శాతం) మంది పాసయ్యారు. 5,009 మంది బాలురుకు 4,617 (92.17 శాతం) మంది, 5,277 మంది బాలికలకు 5,042 (95.55 శాతం) మంది పాసయ్యారు. 93.90 శాతం ఉత్తీర్ణతతో రాష్ట్రంలో మన్యం జిల్లా మొదటి స్థానంలో నిలిచింది. వరుసగా 2023 సంవత్సరంలో 87.47 శాతం, 2024 సంవత్సరంలో 96.37 శాతం ఫలితాలు సాధించగా, ఈ ఏడాది 93.90 శాతం ఉత్తీర్ణతతో టెన్త్ ఫలితాలలో జిల్లా విద్యార్థులు తమకు తిరుగులేదని నిరూపించారు.

మండలాల వారీగా

మండలం	ఉత్తీర్ణత (శాతం)
సీతంపేట	99.59
గుమ్మలక్ష్మీపురం	98.94
పాచిపెంట	96.20
సాలూరు	95.27
జియ్యమ్మవలస	95.03
బలిజిపేట	94.92
కొమరాడ	94.07
కురుపాం	93.10
పార్వతీపురం	92.94
గరుగుబిల్లి	92.21
పాలకొండ	92.20
మక్కువ	92.05
భామిని	91.86
వీరఘట్టం	87.79
సీతానగరం	86.85

జిల్లాలో సీతంపేట మండలంలోని భారతి ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థి కనకాల కనిష్క 593 మార్కులతో సత్తా చాటింది. జిల్లాలో ప్రథమ స్థానంలో నిలిచింది. అదే పాఠశాల విద్యార్థి ఎస్.కీర్తి 592 మార్కులు సాధించింది. ప్రభుత్వానికి చెందిన అన్ని యాజమాన్య పాఠశాలల్లో సాలూరు ప్రభుత్వ బాలికల పాఠశాలకు చెందిన పెద్దపూడి తేజస్వి 592 మార్కులు సాధించి ప్రథమ స్థానంలో నిలిచింది. పార్వతీపురం టిఆర్ఎం మున్సిపల్ ఉన్నత పాఠశాల విద్యార్థిని తుంబలి చికీర్ష 591 మార్కులు, కురుపాం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలకు చెందిన రుషిత 591 మార్కులు సాధించారు. భామిని ఎపి మోడల్ స్కూల్ విద్యార్థి గౌడు జగదీష్ 590, సాలూరు ఎంజెపిఎపిబిసిడబ్ల్యు రెసిడెన్షియల్ ఉన్నత పాఠశాల విద్యార్థిని మరడ గాయత్రి 588, పార్వతీపురం డివిఎం హైస్కూల్ విద్యార్థి దాసరి వెంకటేశ్వరరావు 588, పురోహితునివలస మోడల్ స్కూల్ విద్యార్థి కె.యోగేంద్ర 588, భామిని మోడల్ స్కూల్ విద్యార్థి గౌడ్ జిత్తు 588, మక్కువ హైస్కూల్ విద్యార్థిని ఆర్.జ్యోత్స్న 587, బలిజిపేట హైస్కూల్ విద్యార్థి కోట సందీప్ 587, పెదబొండపల్లి హైస్కూల్ విద్యార్థి భోగి అంజలి 587, గరుగుబిల్లి మండలం కొత్తూరు హై స్కూల్ విద్యార్థి బొంగు పవిత్ర 587 మార్కులతో జిల్లాలో అత్యధిక మార్కులు సాధించారు. జిల్లాలో సీతంపేట మండలంలో అత్యధికం(99.59 శాతం)గా ఉత్తీర్ణత సాధించారు.

యాజమాన్యాల వారీగా ఉత్తీర్ణత శాతాలు

ఈ ఏడాది అన్ని యాజమాన్యాలకు చెందిన విద్యార్థులు జిల్లా మొత్తం 10286 మంది పరీక్షలకు హాజరయ్యారు. 9659 విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. అందులో ఫస్ట్ క్లాస్‌లో 8639, సెకండ్ క్లాస్‌లో 775, థర్డ్ క్లాస్‌లో 245 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. 627 మంది విద్యార్థులు పరీక్ష తప్పారు. యాజమాన్యాల వారీగా పరిశీలిస్తే బిసి వెల్ఫేర్ 98.65 శాతం, మోడల్ స్కూళ్లు 97.36 శాతం, ప్రయివేట్ పాఠశాలలు 97.35 శాతం, ఎపి వెల్ఫేర్ 97.06 శాతం, ట్రైబల్ వెల్ఫేర్ ఆశ్రమ పాఠశాలలు 97.06 శాతం, సాంఘిక సంక్షేమ శాఖ పాఠశాలలు 95.83 శాతం, మున్సిపల్ ఉన్నత పాఠశాలలు 92.84 శాతం, కెజిబివిలు 91.81, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలు 90.22, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు 89.97 శాతం ఫలితాలు సాధించాయి.


కలెక్టర్ హర్షం

పదో తరగతి పరీక్షా ఫలితాల్లో పార్వతీపురం మన్యం జిల్లా రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలవడం పట్ల కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ హర్షం వ్యక్తం చేశారు. 10వ తరగతిలో విజయం సాధించిన విద్యార్థులను ఈ సందర్భంగా కలెక్టర్ అభినందించారు. రాష్ట్రంలోనే మన్యం జిల్లాకు వరుసగా మూడవ సారి మొదటి స్థానం రావడానికి కృషి చేసిన విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యాశాఖ అధికారులు, సిబ్బంది, ప్రభుత్వ పాఠశాలలను దత్తత తీసుకున్న అధికారులకు కలెక్టర్ ఈ సందర్భంగా అభినందనలు తెలిపారు. ఇదే స్ఫూర్తితో రానున్న విద్యా సం.రంలో కూడా ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు.



తేజస్వికి మంత్రి అభినందన

సాలూరురూరల్ : సాలూరు ప్రభుత్వ బాలికల హైస్కూల్ విద్యార్థిని పెద్దపూడి తేజస్వి పదోతరగతి పరీక్షల్లో 592 మార్కులు సాధించింది. ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో జిల్లాలో ప్రథమ స్థానం పొందింది. ఈ సందర్భంగా సాలూరులో తేజస్విని మంత్రి సంధ్యారాణి అభినందించారు. అత్యుత్తమ ప్రతిభతో తేజస్వి జిల్లాలో మొదటి స్థానాన్ని సాధించడం గర్వకారణమని మంత్రి కితాబిచ్చారు.



గుమ్మలక్ష్మీపురంలో విలేకరులతో మాట్లాడుతున్న వ్యకాస జిల్లా ప్రధానకార్యదర్శి కొల్లి గంగునాయుడు

మే 20న సార్వత్రిక సమ్మె

విజయవంతం చేయాలి : వ్యకాస జిల్లా ప్రధానకార్యదర్శి కొల్లి గంగునాయుడు

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

మే 20న చేపట్టే కార్మిక, కర్షక సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొల్లి గంగునాయుడు పిలుపునిచ్చారు. గుమ్మలక్ష్మీపురం మండలం సవరకోటపాడు గ్రామంలో బుధవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలోని బిజెపి మూడోసారి అధికారం చేపట్టినప్పటి నుంచి రైతులకు, గిరిజనులకు, కార్మికులకు తీవ్ర నష్టం చేకూర్చే విధానాలను అవలంబిస్తుందని దుయ్యబట్టారు. ప్రభుత్వ విధానాల వల్ల రోజురోజుకూ ప్రజలు ఉపాధి కోల్పోతున్నారని తెలిపారు. దేశ ప్రజలకు జీవనాధారమైన వ్యవసాయ రంగం పూర్తిగా దివాలా తీస్తుందని, రైతులు పండించే పంటలకు మద్దతుధర కూడా కల్పించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులకు ఉద్యోగ భద్రత, కనీస వేతనాలు కల్పించకుండా దుర్మార్గంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. ప్రజలు భావ ప్రకటన స్వేచ్ఛని వినియోగించుకునేందుకు, సంఘాలు పెట్టుకునేందుకు రాజ్యాంగం కల్పిస్తున్న హక్కులను కూడా కేంద్ర ప్రభుత్వం హరిస్తున్నదని మండిపడ్డారు. అందులో భాగంగా 48 కార్మిక చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చిందని ధ్వజమెత్తారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాల్సి ఉన్నప్పటికీ గత ఐదేళ్లుగా దేశవ్యాప్తంగా కార్మికులకు జీతభత్యాల్లో పెరుగుదల లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఒకపక్క వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్లకు అనుకూలంగా మార్చి పూర్తిగా నాశనం చేయడం వల్ల సామాన్యులకు నిత్యావసర సరుకులు కూడా అందుబాటులోకి లేకుండా పోతున్నాయని చెప్పారు. ఈ సమస్యలన్నిటిపై దేశవ్యాప్తంగా ఉన్న కార్మిక, వ్యవసాయ కార్మిక, రైతు, గిరిజన సంఘాలు ఐక్యంగా మే 20న దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మె నిర్వహిస్తున్నాయని తెలిపారు. ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజాగ్రహాన్ని ఈ సార్వత్రిక సమ్మె జయప్రదం చేయడం ద్వారా తెలియజేయాలని పిలుపునిచ్చారు. అనంతరం సిఐటియు జిల్లా కార్యదర్శి బి.వి.రమణ, గిరిజన సంఘం నాయకులు మండంగి రమణ మాట్లాడారు. సమావేశంలో సిఐటియు నాయకులు ఎన్‌వై నాయుడు, కె.సాంబమూర్తి, ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు ఆడిటి, బిడ్డిక అనిల్, శంకర్‌రావు, సన్యాసిరావు, తదితరులు పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌లు రద్దుకు పోరాటం

సాలూరు రూరల్ : కార్మిక వర్గానికి నష్టం చేసే లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని చేపట్టే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ మద్దతిచ్చింది. బుధవారం జరిగిన ఫెడరేషన్ సమావేశంలో సమ్మె ప్రచారపత్రాలను నాయకులు విడుదల చేశారు. అనంతరం ఫెడరేషన్ అధ్యక్ష, కార్యదర్శులు టి.రాముడు, టి.శంకర్రావు మాట్లాడుతూ పురపాలక సంఘాల్లో ఇప్పటికే నిధులు లేక కార్మిక వర్గానికి చెల్లించాల్సిన బెనిఫిట్స్ నిలిచిపోయాయని తెలిపారు. సబ్బులు, చెప్పులు, నూనెలు, పనిముట్లు తదితర వస్తువులను ఏళ్ల తరబడి ఇవ్వడం లేదన్నారు. వెంటనే స్థానిక సమస్యలను పరిష్కరించకుంటే మే 20వ తేది తరువాత నిరవధిక సమ్మెకు వెళ్తామని, దానికి పాలకవర్గాలదే బాధ్యతని హెచ్చరించారు. కార్యక్రమంలో ఫెడరేషన్ నాయకులు జలగడుగుల హరిబాబు, టి.లక్ష్మి, కె.రాముడు, శ్రీను పాల్గొన్నారు.

సాగుభూములకు పట్టాలివ్వాలి

ఎస్‌టి కమిషన్ చైర్మన్‌కు గిరిజనుల వినతి ● గ్రీన్‌ఫీల్డ్ హైవేను పరిశీలించిన డివిజి



ఎస్‌టి కమిషన్ చైర్మన్ శంకరరావుకు సమస్యలను వివరిస్తున్న గిరిజన సంఘం, భూపోరాట కమిటీ నాయకులు

ప్రజాశక్తి-పాచిపెంట

కుడుమూరులో సర్వే నంబర్ 48లో 11 గ్రామాల గిరిజనులు 782 ఎకరాలను సాగుచేస్తున్నారని, వారికి పట్టాలివ్వాలని ఎస్‌టి కమిషన్ చైర్మన్ డివిజి శంకరరావును ఆదివాసీ గిరిజన సంఘం, కుడుమూరు భూపోరాట కమిటీ నాయకులు కోరారు. మండలంలోని పెద్దగెడ్డ జలాశయాన్ని, గ్రీన్‌ఫీల్డ్ హైవేను బుధవారం డివిజి శంకరరావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన్ను ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కమిటీ సభ్యులు జన్ని రామయ్య, కుడుమూరు భూ పోరాట కమిటీ నాయకులు సుకురు అప్పలస్వామి, నిర్వాసిత మత్స్యకారుల సంఘం నాయకులు మోసూరు చిన్నారావు, సిఐటియు నాయకులు కోరాడ ఈశ్వరరావు కలిసి, వినతిపత్రం అందజేశారు.

కుడుమూరులో గిరిజనుల సాగులో ఉన్న భూములకు దశాబ్దాలుగా పట్టాలు ఇవ్వకపోవడంతో ఆ భూములు అన్యాక్రాంతమయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తంచేశారు. ప్రభుత్వ భూమిని మొకాసా పేరుతో ఏళ్ల తరబడి డబ్బులు వసూలు చేస్తున్న వారిపైన చర్యలు తీసుకోవాలని కోరారు. గత ప్రభుత్వ హయాంలో సర్వే చేసిన వివరాలను కూడా నేటికీ బహిర్గతం చేయలేదని చెప్పారు. ఇప్పటికైనా యుద్ధ ప్రాతిపదికన ఆ భూములకు హక్కులు కల్పించి గిరిజనులను ఆదుకోవాలని చైర్మన్‌ను వారు కోరారు. గిరిజనులపై పెట్టిన తప్పుడు కేసులు ఎత్తివేయాలని విజ్ఞప్తి చేశారు. గ్రీన్‌ఫీల్డ్ రహదారి వల్ల భూములు కోల్పోయిన బంగారు గుడ్డి, కాత్రగుడ్డి, బుచ్చింపాడు గిరిజనులు పట్టాలు లేకపోవడంతో నష్టపోయారని, వారిని ఆదుకోవాలని కోరారు. గ్రీన్‌ఫీల్డ్ హైవే అధికారులు సైడ్ వాల్ నిర్మించారని, దీనివల్ల వ్యవసాయ పంటలను ఇంటికి తెచ్చుకోలేక, మార్కెట్‌కి తీసుకు వెళ్లలేక నరకయాతన పడుతున్నామని వివరించారు. గ్రీన్ ఫీల్డ్ హైవే కింద నుంచి సర్వీస్ రోడ్డు వేయాలని కోరారు. గిరిజన చట్టాలు సక్రమంగా అమలు చేయాలని, జిఒ 3ని కొన సాగించి, గిరిజనులకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. గిరిజన మత్స్యకారులకు అధునాతనమైన లైఫ్ జాకెట్లు, వలలు, బోట్లు పంపిణీ చేయాలని కోరారు. పెద్దగడ్డ జలాశయాన్ని పర్యాటక కేంద్రంగా మార్చి అభివృద్ధి పరచాలన్నారు. అనంతరం చైర్మన్ డివిజి శంకర్రావు మాట్లాడుతూ ఈ సమస్యలను అధికారులు, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో కొటికిపెంట సర్పంచ్ ఇజ్జాడ అప్పలనాయుడు, ఎంపిటిసి సభ్యులు దండి ఏడుకొండలు, తహశీల్దార్ డి.రవి, ఆర్ఐ వెంకటరమణ, సీనియర్ అసిస్టెంట్ పి.తిరుమల రావు, విఆర్ఒ పి.ప్రశాంత్, గిరిజన రైతులు పాల్గొన్నారు.

పథకాల అమల్లో పారదర్శకత

గిరిజన సంక్షేమ శాఖా మంత్రి సంధ్యారాణి

ప్రజాశక్తి-సాలూరు రూరల్

పథకాల అమల్లో అధికార యంత్రాంగం పారదర్శకతతోపాటు వేగాన్ని పాటించాలని గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి తెలిపారు. బుధవారం సాలూరు మండల పరిషత్తు సమావేశ మందిరంలో అన్ని విభాగాల అధికారులు, సిబ్బందితో సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజల సంక్షేమానికి కట్టుబడి పనిచేస్తోందన్నారు. పల్లె ప్రగతి, హరిత హారం, పండుగలకు సంబంధించి సముదాయ శుభ్రత, నీటి సరఫరా, నూతన పింఛన్ల పంపిణీ, గృహ నిర్మాణాల పురోగతి, విద్యుత్ సరఫరా, పాఠశాలల ఆధునీకరణ వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రజల నుండి వచ్చిన ఫిర్యాదులు, వారి అవసరాలు అధికారుల దృష్టికి వచ్చాక వెంటనే స్పందించేలా ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటవ్వాలన్నారు. ప్రజాప్రతినిధులతో అధికారులు సమన్వయంతో పనిచేయాలని, వారి సూచనలు, అవసరాలను పరిగణనలోకి తీసుకొని అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. మండలంలోని కొన్ని గ్రామాలలో అభివృద్ధి కార్యక్రమాలపై అధికారులను ప్రశ్నించారు. ఆయా అభివృద్ధి కార్యక్రమాలు జరిగే విధానంలో ఎటువంటి లోపాలు లేకుండా చూడాలని, పర్యవేక్షణలో వాస్తవ పరిస్థితులపై అధికారులు సమగ్రమైన నివేదికలు అందజేయాలని తెలిపారు. ఈ సమావేశంలో ఎంపిడిఒ గొల్లపల్లి పార్వతి, తహశీల్దార్ ఎన్‌వి రమణ, మండల అధికారులు, ఉద్యోగులు, సచివాలయ సిబ్బంది, టిడిపి మండల అధ్యక్షులు ఆముదాల పరమేష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గిరిజన సంక్షేమ శాఖా మంత్రి సంధ్యారాణి

జీడిపిక్కల కొనుగోలు ప్రారంభం

మండలంలోని బాగువలస వద్ద జీడిపిక్కల కొనుగోలు కేంద్రాన్ని బుధవారం మంత్రి సంధ్యారాణి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో వన్‌ధన్ వికాస్ కేంద్రాల ద్వారా మూడు చోట్ల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేస్తున్నట్లు తెలిపారు. నాణ్యమైన జీడిపిక్కలను రైతులు కొనుగోలు కేంద్రాలకు తెచ్చి మార్కెట్ ధరకు అనుగుణంగా మంచి మద్దతు ధరను పొందాలని కోరారు. కేంద్రంలో అందజేసిన వెంటనే మద్దతు ధరను రైతు ఖాతాలలో జమ చేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో డిఆర్‌డిఎ పీడీ డి.సుధారాణి, ఎంపిడిఒ గొల్లపల్లి పార్వతి, తహశీల్దార్ ఎన్‌వి రమణ, ఏరియా కోఆర్డినేటర్ బి.శివుని నాయుడు, ఎపిఎం జయమ్మ, టిడిపి మండల అధ్యక్షులు ఆముదాల పరమేష్, సిసిలు, విఒఎలు పాల్గొన్నారు.

కిలో జీడిపిక్కలను రూ.200కు కొనాలి

కొమరాడ : విడివికె ద్వారా ఏర్పాటుచేసిన జీడిపిక్కల కొనుగోలు కేంద్రంలో కిలో రూ.200కు కొనాలని సిపిఎం నాయకులు కె.సాంబమూర్తి డిమాండ్‌చేశారు. బుధవారం కొమరాడలో ఆయనతోపాటు ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు కైలాస్, రామారావు మాట్లాడారు. సిపిఎం, గిరిజన సంఘం పోరాట ఫలితంగా చోల్లపదంలో కొనుగోలు కేంద్రం ఏర్పాటుచేశారని చెప్పారు. కానీ కిలో జీడిపిక్కలు రూ.155కి కొనుగోలు చేస్తామని ప్రకటించారని, దీనివల్ల గిరిజనులు నష్టపోతారని తెలిపారు. వెంటనే గ్రామాల్లోకి వెళ్లి గిరిజన రైతుల వద్ద ఉన్న జీడిపిక్కలు వెంటనే కిలో 200 రూపాయలకు కొనుగోలు చేయాలని కోరారు.

ఉగ్ర దాడి దురదృష్టకరం

కురుపాం : పహల్గామ్‌లో పర్యాటకులపై జరిగిన ఉగ్రవాద దాడిని టిడిపి రాష్ట్ర కార్యదర్శి వైరిచర్ల వీరేశ్ చంద్ర దేవ్ తీవ్రంగా ఖండించారు. బుధవారం ఆయన పత్రికా విలేకరులతో మాట్లాడుతూ ఉగ్ర చర్యలకు మన సమాజంలో స్థానం లేదన్నారు. విషాద సమయంలో మనం బాధిత కుటుంబాల వెంట నిలవాలని కోరారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

హేయమైన చర్య

పార్వతీపురం : పర్యాటకులపై ఉగ్రవాదులు చేసిన దాడి చాలా హేయమైన చర్యని గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్ కుమార్ ఒక ప్రకటనలో ఖండించారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా కేంద్ర ప్రభుత్వం కచ్చితమైన, కఠినమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.


ఏరియా ఆస్పత్రిలో రోగులకు కూలర్లు

సాలూరు : స్థానిక ఏరియా ఆస్పత్రిలో చేరిన రోగులకు వేసవి కాలంలో ఎండల తీవ్రత నుంచి కొంత ఉపశమనం కలిగించడానికి నాలుగు వార్డుల్లో ఎయిర్ కూలర్లు ఏర్పాటు చేశారు. ఆస్పత్రి నిధుల నుంచి 40 వేల రూపాయలతో కొనుగోలు చేసిన నాలుగు కూలర్లను బుధవారం సూపరింటెండెంట్ విఆర్ మీనాక్షి, ఆర్ఎంఒ కాశీ విశ్వనాథ్ ప్రారంభించారు. రోగుల సౌకర్యార్థం వేసవి ఉష్ణోగ్రతల కారణంగా ఏర్పాటు చేసినట్లు సూపరింటెండెంట్ మీనాక్షి తెలిపారు.

ఉపాధి బకాయిలు చెల్లించాలని ధర్నా

ప్రజాశక్తి-సీతానగరం

ఉపాధి హామీ కూలీలకు బకాయిలు వెంటనే చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యాన బుధవారం చినబోగిలి సచివాలయం వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వ్యకాస జిల్లా అధ్యక్షులు రెడ్డి ఈశ్వరరావు మాట్లాడుతూ మండలంలో జనవరి నెల నుంచి 12 వారాల పాటు పనులు చేశారని, కానీ నేటికీ వేతనాలు చెల్లించక పోవడం దారుణమన్నారు. చేసిన పనికి 14 రోజుల్లో కూలి చెల్లించాలని చట్టంలో నిబంధన ఉన్నప్పటికీ అమలు చేయడం లేదన్నారు. ఉపాధి హామీకి కేటాయించిన నిధులను ఇతర పథకాలకు దారి మళ్లించవద్దని డిమాండ్‌చేశారు. వ్యవసాయంలో యాంత్రీకరణ పెరిగిపోవడం వల్ల కూలీలకు పనులు తగ్గిపోయాయని తెలిపారు. సంవత్సరానికి 200 రోజుల పని కల్పించి, రోజు కూలి 600 రూపాయలు చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్‌చేశారు. పని ప్రాంతంలో తాగునీరు, నీడ, మందులు, వంటి సౌకర్యాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. మేట్లకు పారితోషం చెల్లించాలని, ఫొటో మస్టర్ వేయడానికి సెల్‌ఫోన్లు పంపిణీ చేయాలని కోరారు. రెండో పూట పని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వ్యకాస మండల అధ్యక్షులు సిహెచ్ కృష్ణ, ఉపాధి కూలీలు ఎం.లక్ష్మణరావు, చుక్క గణేష్, రామినాయుడు, పార్వతి, రామలక్ష్మి, చిన్నమ్మలు తదితరులు పాల్గొన్నారు.



వినతి అందిస్తున్న వ్యకాస జిల్లా అధ్యక్షులు రెడ్డి ఈశ్వరరావు, ఉపాధి కూలీలు

కబ్జాలన్నింటిపైనా బుల్డోజర్ తోలండి

డిప్యూటీ తహశీల్దార్‌ను కోరిన కాంగ్రెస్ పార్టీ నాయకులు

ప్రజాశక్తి-పార్వతీపురం

పట్టణంలో కబ్జాలన్నింటిపైనా బుల్డోజర్ తోలాలని, ఎలాంటి పక్షపాతమూ చూపించవద్దని కాంగ్రెస్ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం కాంగ్రెస్ పార్టీ ఒబిసి జిల్లా చైర్మన్ వంగల దాలి నాయుడు, మండల అధ్యక్షులు తీళ్ల గౌరీ శంకరరావు తదితరులు పార్వతీపురం డిప్యూటీ తహశీల్దార్ పి.కిరీటిని కలిసి చెరువులు, ప్రభుత్వ స్థలాల కబ్జాపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజకీయ కక్షలకు తావివ్వకుండా ఏ పార్టీ వారైనా, ఎంతటి వారివైనా వాటి పైకి బుల్డోజర్ తీసుకెళ్లి కబ్జాలు తొలగించాలన్నారు. అంతేతప్ప పనిగట్టుకొని ఒకరిద్దరివి తొలగించడం సరికాదని అభిప్రాయపడ్డారు. ముందు చెరువుల్లో నిర్మితమైనట్లు ఆరోపణలు ఉన్న ప్రభుత్వ కార్యాలయాలు, రెవెన్యూ సిబ్బంది భవనాలు తొలగించాలని కోరారు. కళ్ల ముందే ఆక్రమణలు జరుగుతున్న పట్టీపట్టనట్లు వ్యవహరించే సిబ్బందిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్‌చేశారు.

ఎడ్యుకేషన్ అసిస్టెంట్లకు ఉద్యోగోన్నతులు కల్పించండి

ప్రజాశక్తి-పార్వతీపురం రూరల్

సచివాలయ ఎడ్యుకేషన్ అసిస్టెంట్లకు వివిధ సంక్షేమ వసతిగృహాల్లో ప్రమోషన్లు కల్పించాలని వారంతా ఎమ్మెల్యే బోనెల విజయచంద్రకు బుధవారం వినతి అందించారు. విధుల్లో చేరి ఐదున్నరేళ్లు పూర్తయినా ఇంతవరకు ఎటువంటి ప్రమోషన్లు కల్పించలేదన్నారు. సచివాలయాల్లో పనిచేస్తున్న వివిధ శాఖల వారికి ఇప్పటికే ఉద్యోగోన్నతులు ఇచ్చారని గుర్తుచేశారు. తమ ప్రొబేషన్ రెండేళ్లకు రావలసిన నోషనల్ ఇంక్రిమెంట్లు మంజూరు చేయాలని కోరారు. ఈ విషయంపై ఎమ్మెల్యే స్పందిస్తూ సమస్యలను ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, సంబంధిత శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్తానని హామీనిచ్చారు.

పిల్లలకు టీకాలు తప్పనిసరి

ప్రజాశక్తి-సీతానగరం

ప్రతీ పిహెచ్‌సి పరిధిలో బుధ, శనివారాల్లో టీకా కార్యక్రమాన్ని పక్కాగా నిర్వహించాలని ఆరోగ్యశాఖ జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి.జగన్ మోహనరావు సూచించారు. మండలంలోని చిన్నరాయుడుపేట గ్రామంలో బుధవారం ఆయన ఆకస్మికంగా పర్యటించారు. గృహ సందర్శనలు చేసి పిల్లల టీకా కార్డులను తనిఖీ చేశారు. పిల్లల వయస్సు బట్టి టీకాలు షెడ్యూల్ ప్రకారం వేస్తున్నారా? అని వ్యాక్సిన్ తేదీలను పరిశీలించారు. టీకా గడువు తేదీల నమోదుపై గమనించి ముందుగా తెలియజేస్తున్నారా? అని తల్లిదండ్రులను అడిగి తెలుసుకొన్నారు. టీకా ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. పిల్లల ఆరోగ్య వివరాలు తెలుసుకుని ప్రాథమికంగా అవసరమైన మందులు గ్రామంలో అందుబాటులో ఉండాలని సిబ్బందికి సూచించారు. వేసవిలో పిల్లల విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. కార్యక్రమంలో ఎపిడమిక్ ఇఒ సత్తిబాబు, వైద్య సిబ్బంది ఉన్నారు.



వ్యాక్సిన్ కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న ఆరోగ్య శాఖ డిపిఒ జగన్‌మోహనరావు



జెడ్‌పి స్థాయి సంఘ సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

సకాలంలో విత్తనాలు అందించాలి

ప్రజాశక్తి-విజయగనరంటౌన్

ఈ ఏడాది జిల్లాలో వర్షపాతం ఆశాజనకంగా నమోదు అయ్యే అవకాశం ఉన్నందున సకాలంలో రైతులకు విత్తనాలు, ఎరువులు సరఫరా చేసేందుకు సిద్ధంగా ఉండాలని జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు వ్యవసాయశాఖ అధికారులను ఆదేశించారు. వ్యవసాయంలో డ్రోన్ల వినియోగంపై జిల్లాలో ప్రజా ప్రతినిధులందరికీ అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేయాలని జిల్లా వ్యవసాయాధికారికి సూచించారు. జెడ్‌పి చైర్మన్ అధ్యక్షతన బుధవారం స్థాయీ సంఘ సమావేశాలు జరిగాయి. వివిధ అంశాలపై చర్చించారు. మామిడి పంట వల్ల రైతులకు అధిక లాభాలు వచ్చే పరిస్థితులు కల్పించాలని ఉద్యాన శాఖాధికారులను చైర్మెన్ ఆదేశించారు. జిల్లాలో మహిళా శిశు సంక్షేమ శాఖలో ఖాళీ గా ఉన్న అంగన్వాడీ సిబ్బందిని త్వరితగతిన భర్తీ చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. రానున్న వేసవి సెలవుల్లో కస్తూరిభా పాఠశాలల్లో అవసరమైన మౌలికసదుపాయాలు ముందస్తుగా సిద్ధం చేయాలని, సర్వశిక్ష అభియాన్ కోర్డినేటర్ ను ఆదేశించారు. కెజిబివిల్లో ఉత్తీర్ణత శాతం తగ్గడంపై ఆయన మాట్లాడుతూ లోటుపాట్లు ఉంటే తన దృష్టి తేవాలన్నారు. ఫెయిల్ అయిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. మంగళవారం జమ్మూ కాశ్మీర్ లో పర్యాటకుల పై జరిగిన దాడిని ఈ సందర్భంగా ఖండించారు. చనిపోయినవారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. 3వస్థాయీ సంఘ సమావేశానికి బాబూజీనాయుడు, 5వ స్థాయీ సంఘ సమావేశానికి సంకిలి శాంతకుమారి అధ్యక్షత వహించారు. జెడ్‌పి సిఇఒ బివి సత్యనారాయణ, స్థాయీ సంఘాల సభ్యులు, జెడ్‌పిటిసిలు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి సమిష్టి కార్యాచరణ

మంత్రి సంధ్యారాణి

ప్రజాశక్తి-సాలూరు రూరల్

పార్టీ బలోపేతం కోసం సమిష్టి కార్యాచరణ ద్వారా ప్రతీ కార్యకర్త, నాయకుడు కృషి చేయాలని మంత్రి సంధ్యారాణి కోరారు. బుధవారం మండలంలోని కొట్టుపురం పంచాయతీ పరిధిలోని ఎరగడవలస గ్రామంలో టిడిపి మండల స్థాయి నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కార్యకర్తల పార్టీ అంటేనే టిడిపి గుర్తొస్తుందని, అటువంటి పార్టీని మరికొన్ని తరాలు ముందుకు తీసుకెళ్లే బాధ్యత మనందరిపై ఉందని స్పష్టంచేశారు. దీనికోసం సమిష్టి కార్యక్రమంతో ముందుకు వెళ్లి బలమైన రాజకీయ శక్తిగా నిలదొక్కుకునేలా చేయాలని తెలిపారు. గ్రామస్థాయిలో ఉండే ప్రజాప్రతినిధులు, నాయకులు ప్రజల అవసరాలను గుర్తించి, వారికి ప్రభుత్వం ద్వారా సంక్షేమ పథకాలు అందేలా చూడాలన్నారు. ఆ విధంగా పనిచేసినప్పుడే ప్రజల ఆదరణ పొందుతామని చెప్పారు. అన్ని గ్రామాలకు తాగునీరు, రోడ్డు సదుపాయం కల్పించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు ఆముదాల పరమేష్, డొంక అన్నపూర్ణ, భూస తవుడు, మత్స శ్యామ్, తాడుతూరు తిరుపతిరావు, అక్యాన తిరుపతిరావు, సింహాచలం, యుగంధర్, త్రినాథరావు, రజిని, తదితరులు పాల్గొన్నారు.

ఎసిఎం పిచికారీపై శిక్షణ

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

మలేరియా మందు పిచికారీపై ఆరోగ్య శాఖ సిబ్బందికి శిక్షణ అత్యవసరమని జిల్లా సహాయ మలేరియా అధికారి సూర్యనారాయణ అన్నారు. మండలంలోని తాడికొండ, భద్రగిరి, నీలకంఠాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలోని క్షేత్రస్థాయి సిబ్బందికి స్ప్రేయింగ్‌పై బుధవారం అవగాహన కల్పించారు. మలేరియా కేసులను నిరోధించాలంటే స్ప్రేయింగ్ శత శాతం జరిగేలా చూడటం అందరి బాధ్యతన్నారు. మలేరియా కేసులు రాకుండా చూడాలని, లేదా వచ్చిన కేసులకు సత్వర చికిత్స చేసి మలేరియా తగ్గేలా చూడాలని కోరారు. మే నెలలో మొదటి విడత స్ప్రేయింగ్ ప్రారంభం అవుతుందన్నారు. జులైలో రెండో విడత చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపిడిఒ సాల్మన్ రాజు, ఇఒపిఆర్‌డి ధర్మారావు, సబ్ యూనిట్ అధికారి మోహన్ రావు, అప్పలనాయుడు, క్షేత్ర స్థాయి సిబ్బంది పాల్గొన్నారు.

సిఎం సహాయనిధి చెక్కు అందజేత

ప్రజాశక్తి - భోగాపురం


అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తికి సీఎం సహాయ నిధి చెక్కును రాష్ట్ర మార్క్ ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు బుధవారం అందజేశారు. చేపల కంచేరు పంచాయతీ పిన్నింటి పాలెం గ్రామానికి చెందిన కాగితాల మధు గత కొన్ని రోజుల నుంచి అనారోగ్యంతో బాధపడుతున్నాడు. దీంతో ఆయనకు సీఎం సహాయ నిధి నుంచి రూ.70వేలు వచ్చింది. మధు కుటుంబ సభ్యులకు పోలిపల్లిలో ఈ చెక్కును బంగార్రాజు అందజేశారు. టిడిపి నాయకులు నీలాపు అప్పల రామిరెడ్డి, కోరాడ తాతారావు, రీసు రమణ, లోకేష్ పాల్గొన్నారు.

బొబ్బిలి: తమ కుమారుడు హర్షిత, కుమార్తె శాస్త్ర శస్త్ర చికిత్సకు సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి నిధులు మంజూరు చేసి ఎల్‌ఒసి ఇచ్చినందుకు సీఎం చంద్రబాబుకు, ఎమ్మెల్యే బేబినాయనకు కునుకు వెంకటరమణ కృతజ్ఞతలు తెలిపారు. బొబ్బిలి మండలం సిహెచ్ బొడ్డవలసకు చెందిన కునుకు మన్మధరావుకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. వీరిద్దరు పుట్టుక నుంచి వినికిడి లోపంతో బాధ పడుతున్నారు. గతంలో ఇద్దరికి రూ.17లక్షల వరకు ఖర్చు చేసి శస్త్ర చికిత్స చేశారు. మరో శస్త్ర చికిత్సకు రూ.14లక్షల వరకు ఖర్చు అవుతుందని వైద్యులు చెప్పడంతో వైద్యానికి డబ్బులు లేకపోవడంతో ఎమ్మెల్యే బేబినాయనను కలిసి తమ గోడును వినిపించారు. దీంతో ఎమ్మెల్యే బేబినాయన సీఎం చంద్రబాబుతో మాట్లాడి సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి ఒకొక్కరికి రూ.4,94,900 మంజూరు చేస్తూ ఎల్‌ఒసి ఇవ్వడంతో బొబ్బిలి కోటలో వాటిని బుధవారం అందించారు. దీంతో వారు ఎమ్మెల్యే బేబినాయన, సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు.

భోగాపురంలో దేవిశ్రీ ప్రసాద్ ప్రత్యక్షం

ప్రజాశక్తి - భోగాపురం

ప్రముఖ సంగీత దర్శకుడు దేవిశ్రీ ప్రసాద్ మంగళవారం సాయంత్రం భోగాపురంలో ప్రత్యక్షమై సందడి చేశారు. జాతీయ రహదారిపై శ్రీకాకుళం వైపు వెళ్తూ హైవేలో ఉన్న అపర్ణ హోటల్ వద్ద కొంతసేపు ఆగారు. ఇది తెలుసుకున్న కొంతమంది అభిమానులు ఆయనతో సెల్ఫీలు దిగారు. అనంతరం కొంతసేపు సొంత పని చూసుకొని అక్కడి నుంచి విజయనగరం వైపు వెళ్ళిపోయారు.



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

ఆకట్టుకున్న విద్యార్థినుల నృత్యాలు

ప్రజాశక్తి-సాలూరు

పట్టణంలోని శ్రీ వెంకట విద్యాగిరి పాఠశాల 33వ వార్షికోత్సవం సందర్భంగా బుధవారం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థినుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. కరస్పాండెంట్ డాక్టర్ కోడూరు సాయి శ్రీనివాసరావు పర్యవేక్షణలో జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను అలరించాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీయడానికి ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం లక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

టెన్త్‌లో తగ్గేదేలే

- ప్రతిభ కనబరిచిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు
- ప్రయివేటు పాఠశాలలకు ధీటుగా ఫలితాలు

ప్రజాశక్తి-సాలూరు రూరల్

పదో తరగతి ఫలితాల్లో జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు సత్తాచాటారు. సాలూరు పట్టణ, మండల పరిధిలోని ప్రభుత్వ, ఆశ్రమ, మోడల్, గిరిజన, జ్యోతిరావు పూలే పాఠశాలల్లో విద్యార్థులు అద్భుతమైన ప్రతిభ చూపించి వంద శాతం ఉత్తీర్ణత సాధించారు సాలూరు ప్రాంతంలో 26 పాఠశాలలకు గాను 15 పాఠశాలలు నూరు శాతం ఉత్తీర్ణత సాధించాయి. 1182 మందికి గాను 1124 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. సాలూరు ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థిని పెద్దపూడి తేజస్వి 592 మార్కులతో ప్రథమ స్థానం, మహాత్మా జ్యోతిరావు పూలే ఆశ్రమ పాఠశాల విద్యార్థిని పారాది గాయత్రి 589 మార్కులతో ద్వితీయ స్థానం, మోడల్ స్కూల్ విద్యార్థి వై.యోగేంద్ర 588 మార్కులతో మూడో స్థానాన్ని సాధించారు. వీరిని ఎంఇఒ రాజ్ కుమార్, ఎన్ వెంకట్రావు, మూకల పెంటయ్య, ఎ.అంజలీదేవి, కె.సత్యనారాయణ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు అభినందించారు.

రిషితకు 591 మార్కులు



మర్రాపు రిషిత

కురుపాం : పదో తరగతి పరీక్షల్లో కురుపాం హైస్కూల్ విద్యార్థి మర్రాపు రిషిత 591 మార్కులు సాధించింది. పొన్నాడ ఈశ్వరరావు 583 మార్కులు, మెరగల శశిశ్రీ 580 మార్కులు సాధించినట్లు ఎంఇఒ ఎన్.సత్యనారాయణ తెలిపారు. మండలంలో 656 మందికి గాను 607 మంది ఉత్తీర్ణులైనట్లు చెప్పారు. సత్తాచాటిన విద్యార్థులకు ప్రధానోపాధ్యాయులు టి.శంకరరావు, సిబ్బంది స్వీట్లు తినిపించి, అభినందనలు తెలిపారు.

ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులు

కొమరాడ : పదో తరగతిలో మండల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచినట్లు ఎంఇఒ జామి నారాయణస్వామి తెలిపారు. కోటిపాం హైస్కూల్ విద్యార్థి కె.లోకేష్ 583 మార్కులు, మాదలింగి హైస్కూల్ విద్యార్థి ఎం.ఐశ్వర్య 582 మార్కులు సాధించారని చెప్పారు. కోటిపాం హైస్కూల్, గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాలలో వంద శాతం ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు.



ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందిస్తున్న భామిని ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్, సిబ్బంది

భామిని ఆదర్శ పాఠశాల ప్రభంజనం

భామిని : పదో తరగతి ఫలితాల్లో భామిని ఆదర్శ పాఠశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారని ప్రిన్సిపల్ రఘుపాత్రుని శివకుమార్ తెలియజేశారు. వంద శాతం ఉత్తీర్ణత సాధించినట్లు చెప్పారు. గౌడు జగదీష్ 590 మార్కులు, గౌడు జీతూ 588 మార్కులు, గెల్లంకి కావ్యశ్రీ 586 మార్కులతో టాపర్లుగా నిలిచారు. వీరిని ఎంఇఒ శ్రీనివాసరావు, పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ వానపల్లి రవికుమార్, కమిటీ సభ్యులు అభినందించారు.

సీతంపేట ఐటిడిఎలో బాలికలదే హవా



ఎస్.జస్పి

సీతంపేట : సీతంపేట ఐటిడిఎ పరిధిలో ఈ ఏడాది పదో తరగతి ఫలితాల్లో బాలికలే హవా సాగించారు. ఐటిడిఎ పరిధిలో 44 ఆశ్రమ, 4 గురుకుల పాఠశాలల నుంచి 1680 విద్యార్థులు పరీక్షలు రాయగా, 1534 మంది ఉత్తీర్ణత సాధించారు. 18 పాఠశాలలో శత శాతం ఉత్తీర్ణత సాధించారు. సీతంపేట మండలంలో హడ్డుబంగి బాలికల ఆశ్రమ పాఠశాల విద్యార్థి యస్.జస్పి 579 మార్కులు సాధించినట్లు ప్రధానోపాధ్యాయులు బి.ఉమావాణి తెలిపారు. సీతంపేట గురుకుల పాఠశాలకు చెందిన ఎల్.అక్షయ 579 మార్కులు సాధించిందని ప్రిన్సిపల్ అరుంధతి తెలిపారు. కెజిబివిలో శతశాతం ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపల్ మాధవి తెలిపారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఐటిడిఎ పిఒ వి.యశ్వంత్ కుమార్ రెడ్డి, డిడి అన్నదొర, ఎపిఒ చినబాబు, డిప్యూటీ డిఇఒ రవి ప్రసన్నకుమార్, ఎటిడబ్ల్యూఒ మంగవేణి, ఎఎంఒ కోటి బాబు అభినందించారు.

సత్తాచాటిన మున్సిపల్ పాఠశాలలు



తుంబలి చికీర్ష

పార్వతీపురం టౌన్ : పదో తరగతి ఫలితాలలో పట్టణంలోని మూడు మున్సిపల్ ఉన్నత పాఠశాలల విద్యార్థులు సత్తాచాటారు. టిఆర్ఎం ఉన్నత బాలికల పాఠశాల విద్యార్థి తుంబలి చికీర్ష 591 మార్కులు సాధించింది. డివిఎం ఉన్నత పాఠశాల విద్యార్థి నాగతేజ 588 మార్కులు సాధించాడు. కెపిఎం పాఠశాల విద్యార్థి పి.చక్రి 582 మార్కులు సాధించాడు. మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు, తల్లిదండ్రులకు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు అభినందనలు తెలియజేశారు.



మక్కువ.. విద్యార్థులను అభినందిస్తున్న ఎంఇఒలు సత్యనారాయణ, శ్యామసుందర్

సత్తాచాటిన ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు

మక్కువ : పదో తరగతి పరీక్ష ఫలితాలలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు సత్తాచాటారు. మక్కువ జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల విద్యార్థి రుగడ జ్యోత్స్న 587 మార్కులు, శంబర హైస్కూల్ విద్యార్థి టి.మహిమ 585 మార్కులు, మక్కువ హైస్కూల్ విద్యార్థి ఎ.సిరి చందన 584 మార్కులు సాధించారు. వీరిని ఎంఇఒలు పి.సత్యనారాయణ, వై.శ్యామసుందర్ అభినందించారు. వీరికి యుటిఎఫ్ ఆధ్వర్యాన ఎంఎస్ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు మరడ శ్రీనివాసరావు సహకారంతో సత్కారం చేసి, నగదు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు పి.మధుసూదనరావు, జిల్లా కార్యదర్శి ఎం.శంకర్రావు, మండల అధ్యక్షులు ఎం రాజేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి సిహెచ్ ధనుంజయ్‌రావు, మండల మహిళా సహాధ్యక్షురాలు సంతోషి కుమారి పాల్గొన్నారు.

జియ్యమ్మవలసలో ఉత్తమ ఫలితాలు

గుమ్మలక్ష్మీపురం : పదో తరగతి ఫలితాల్లో జియ్యమ్మవలస మండల విద్యార్థులు మంచి ఉత్తీర్ణత సాధించారు. చినమేరంగి ఉన్నత పాఠశాల విద్యార్థి వర్ష 582 మార్కులు సాధించింది. పెదమేరంగి తిరుమల సాయి పాఠశాలలో వై.శాలిని 569 మార్కులు సాధించింది. విద్యార్థులను కరస్పాండెంట్ రౌతు సరళ కుమారి, అకడమిక్ సలహాదారు రౌతు. వెంకట రమణ, ప్రధానోపాధ్యాయులు సతివాడ శంకరరావు అభినందించారు.

శరణ్యకు ప్రథమ స్థానం



మీసాల శరణ్య

పాచిపెంట : టెన్త్ ఫలితాల్లో స్థానిక జెడ్‌పి హైస్కూలుకు చెందిన మీసాల శరణ్య 578 మార్కులు సాధించి ప్రథమ స్థానంలో నిలిచింది. శరణ్య వైస్ ఎంపిపి మీసాల నారాయణ, చంటి దంపతుల కుమార్తె. అదే పాఠశాలకు చెందిన మామిడి రూప శ్రీ 576 మార్కులతో ద్వితీయ స్థానం, 573 మార్కులతో పి.యోగిత తృతీయస్థానంలో నిలిచారు. వీరినిఉపాధ్యాయులు, అధికారులు, తల్లిదండ్రులు అభినందించారు.

ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తమ ఫలితాలు



కె.సాయికుమార్

సీతానగరం : మండలంలో ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన పదో తరగతి విద్యార్థులు మంచి ఫలితాలు సాధించారని ఎంఇఒలు జి.సూర్యదేముడు, ఎం. వెంకటరమణ తెలిపారు. గాదెలవలస ఉన్నత పాఠశాల నుంచి 68 మంది విద్యార్థులు హాజరుకాగా 68 ఉత్తీర్ణత శాతం సాధించారు. జోగింపేట ప్రతిభ గురుకుల పాఠశాల విద్యార్థి కె.సాయి కుమార్ 580 మార్కులు సాధించాడు. సీతానగరం జెడ్‌పి హైస్కూల్ విద్యార్థి బంక శ్రావణి 578 మార్కులు, నిడగల్లు పాఠశాల విద్యార్థి భోగి. హాసిని 576 మార్కులు సాధించారు.

పవిత్రకు 587 మార్కులు



బొంగు పవిత్ర

గరుగుబిల్లి : కొత్తూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన బొంగు పవిత్ర 587 మార్కులతో మండలంలో మొదటి స్థానం సాధించింది , ఎం. జ్యోస్నా 580 మార్కులతో రెండో స్థానంలో నిలిచారని ఎంఇఒలు దత్తి అప్పలనాయుడు, ఎం.కొండలరావు తెలిపారు బిఆర్ అంబేద్కర్ గురుకులంలో 76 మందికి 74 మంది ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ సంధ్యారాణి తెలిపారు.

సత్తాచాటిన విద్యార్థులు




జి.నందిని

వీరఘట్టం : మండలంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు 87.13శాతం ఉత్తీర్ణతతో సత్తా చాటారు. రేగులపాడు కెజిబివి విద్యార్థి జి.నందిని 582, నీలానగరం జెడ్‌పి ఉన్నత పాఠశాల విద్యార్థి డి.గ్రీష్మ 578, రేగులపాడు కెజివిబి విద్యార్థి ఎం.శ్రీవిద్య 575 మార్కులతో ఉత్తీర్ణత సాధించి మండలానికి టాపర్‌లుగా నిలిచారు. నీలానగరం, రేగులపాడు కెజిబివి, గంగంపేట గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలలో శత శాతం ఉత్తీర్ణత సాధించారు. ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను ఎంఇఒలు డి.గౌరినాయుడు, ఆర్.ఆనందరావు ప్రత్యేక అభినందనలు తెలిపారు.

మోడల్ ప్రైమరీ స్కూల్‌గా పెద్దూరు పాఠశాల

ప్రజాశక్తి-సీతంపేట

మండలంలో పెద్దూరు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల మోడల్ ప్రైమరీ స్కూల్‌గా ఎంపికైందని ఎంఇఒ డి.సూర్యచంద్రరావు తెలిపారు. బుధవారం పాఠశాలలో నిర్వహించిన ముగింపు సమావేశంలో ఆయన మాట్లాడారు విద్యార్థులను వేసవికాలంలో చాలా జాగ్రత్తగా తల్లిదండ్రులు చూడాలని సూచించారు. ఇక్కడ పాఠశాలలో చదువుతోపాటు క్రమశిక్షణ కూడా ఉంటుందని, విద్యార్థులకు మంచి సామర్థ్యం ఉందని చెప్పారు. ఈ పాఠశాల మోడల్ ప్రైమరీ స్కూల్‌గా ఎంపిక కావడంతో రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడు నెల్లి సత్యంనాయుడు, హెచ్‌ఎం ప్రసాద్ అభినందించారు.



మాట్లాడుతున్న ఎంఇఒ సూర్యచంద్రరావు



ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందిస్తున్న శ్రీజన పాఠశాల ఎమ్‌డి శ్రీనివాసరావు

'శ్రీజన్' ప్రభంజనం

ప్రజాశక్తి- పార్వతీపురం

పదో తరగతి ఫలితాల్లో శ్రీజన్ పాఠశాల విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. విద్యార్థులు కె.సాధన, కె.గణేష్ 580 మార్కులు సాధించారని, శ్రీజన్ ప్రారంభించిన మూడేళ్లలో వరుసగా హ్యాట్రిక్ విజయాలను సాధించామని ఎమ్‌డి శ్రీనివాసరావు తెలిపారు. 40 మంది విద్యార్థుల్లో 26 మంది 500కు పైబడి మార్కులు సాధించారన్నారు. ఐఐటి, నిట్ వంటి ప్రతిభా పరీక్షల కాన్సెప్ట్‌తో విద్యా బోధనలు అందించడం ద్వారా విద్యార్థులు మంచి ఫలితాలు సాధిస్తున్నారని చెప్పారు. అందుకు కృషి చేసిన ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులకు అభినందనలు తెలియజేశారు.

భాస్కర్ స్కూల్ హవా

పార్వతీపురం: పదోతరగతి ఫలితాల్లో పట్టణంలోని భాస్కర్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ హవా కొనసాగించింది. ఎం.ముబారక్ 589 మార్కులు సాధించి స్కూల్ ఫస్ట్ గా నిలిచాడనిపాఠశాల చైర్మన్ చుక్క భాస్కరరావు తెలిపారు. ఎస్.మోక్షిత 584, కె.కృష్ణ కౌశిక్ 565 మార్కులు సాధించారని చెప్పారు. వీరందరినీ అభినందించారు.

'భారతి' విజయకేతనం


సీతంపేట : మండలంలో పులిపుట్టి సమీపంలోని భారతి ఇంటర్నేషనల్ పాఠశాల విద్యార్థులు పదో తరగతి ఫలితాల్లో శతశాతం ఉత్తీర్ణత సాధించారు. కనకాల కనిష్క 593 మార్కులతో ప్రథమ స్థానంలో నిలిచింది. కీర్తి 592 మార్కులు సాధించింది. వీరిని ప్రిన్సిపల్ నవీన్, కరస్పాండెంట్ పెంటయ్య అభినందించారు.

ఆరోగ్య జాగ్రత్తలు తప్పనిసరి

డిఎంహెచ్ఒ భాస్కరరావు

ప్రజాశక్తి-కొమరాడ

వేసవి దృష్ట్యా ఆరోగ్యం పరంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి భాస్కరరావు అన్నారు. బుధవారం కొమరాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఆసుపత్రిలో రోగులు పొందుతున్న వైద్యసేవలపై ఆరా తీశారు. ల్యాబ్‌లో చేస్తున్న పరీక్షల్లో వివరాలను ఆరా తీసి, పిహెచ్‌సి పరిసరాలను పరిశీలించారు. అనంతరం రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధిహామీ వేతనదారులకు వడదెబ్బ, డీహైడ్రేషన్‌కు గురికాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వైద్య సిబ్బంది అవగాహన కల్పించాలన్నారు. వడదెబ్బకు గురైతే తక్షణమే నిర్వర్తించాల్సిన కార్యాచరణపై, ఒఆర్ఎస్ ద్రావణం వినియోగంపై ప్రజలకు వివరించాలని తెలిపారు. ఆరోగ్య కేంద్రాలు, గ్రామాల్లో ఒఆర్ఎస్ ప్యాకెట్లు సిద్ధంగా ఉండాలన్నారు. వేసవి రుగ్మతలు గుర్తిస్తే తగు చికిత్స అందజేసి వివరాలు నమోదు చేసి జిల్లా ఆరోగ్య కార్యాలయానికి తెలియజేయాలని వైద్య సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి అరుణ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.



రికార్డులు తనిఖీ చేస్తున్న డిఎంహెచ్ఒ భాస్కరరావు

రాయితీ పరికరాలను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి-సాలూరు రూరల్

రాయితీపై ఇచ్చే వ్యవసాయ యాంత్రీకరణ పరికరాలను సక్రమంగా వినియోగించుకోవాలని వ్యవసాయ శాఖ రీజనల్ డైరెక్టర్ ఎన్‌వి రమేష్ రైతులను కోరారు. మండలంలోని కందులపదం, మావుడి, మరిపల్లి, శివరాంపురం గ్రామాల్లో వరి నూర్పిడి యంత్రాలను కొద్ది నెలల కిందట రైతులకు అందజేశారు. బుధవారం ఆ యంత్రాలను ఎడి పరిశీలించారు. యంత్ర పరికరాలు కావలసినవారు ఆన్లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి శివరామక్రిష్ణ, మండల వ్యవసాయ అధికారి పండా అనురాధ, ఎఇఒ శ్రీనివాస్, విఎఎలు పాల్గొన్నారు.



వరినూర్పిడి యంత్రాలను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

7న ఆదివాసీ ఆత్మగౌరవ సభ

ప్రజాశక్తి గుమ్మలక్ష్మీపురం

మే నెల 7న నిర్వహించే ఆదివాసీ ఆత్మగౌరవ సభ, ర్యాలీని విజయవంతం చేయాలని కోరుతూ గుమ్మలక్ష్మీపురంలో బుధవారం కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ట్రైబల్ రైట్స్ ఫోరం రాష్ట్ర అధ్యక్షులు రొబ్బ లోవరాజు మాట్లాడుతూ రాష్ట్రంలో ఆదివాసీలకు జరుగుతున్న అన్యాయంపై ప్రజలు, ప్రజాసంఘాలు, ఆదివాసీ జాయింట్ యాక్షన్ కమిటీ పిలుపుమేరకు సభ నిర్వహిస్తున్నామని తెలిపారు. ఎన్నో సంవత్సరాలుగా ఎదురు చూస్తున్న డిఎస్‌సి నోటిఫికేషన్ వచ్చిందనే సంతోషం కనీసం ఏ ఒక్క ఆదివాసీలో కూడా లేకపోవడం చాలా బాధాకరమన్నారు. ప్రభుత్వం వెంటనే దీనిపై స్పందించాలని కోరారు. కార్యక్రమంలో జెఎసి వైస్ చైర్మన్ దుక్క సీతారాం, నాయకులు ఇంటికుప్పల రామకృష్ణారావు, లక్ష్మయ్య, సూర్యం, కొండలరావు, గిరిజన నాయకులు పాల్గొన్నారు.

వాహనాలు సీజ్

ప్రజాశక్తి - బొబ్బిలిరూరల్

మండలంలోని పారాది వేగావతి నది వద్ద అక్రమంగా ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయన్న సమాచారం మేరకు తహశీల్దార్ యం.శ్రీను అదేశాల మేరకు బుధవారం నదివద్ద ఒక జేసీబి, రెండు ట్రాక్టర్లను సీజ్ చేశామని ఆర్ఐ కొల్లి రాంకుమార్ తెలిపారు. అక్రమ ఇసుక తవ్వకాలు జరిపితే కఠిన చర్యలు తీసుకొంటామని తహశీల్దార్ హెచ్చరించారు. విఆర్ఒ రవి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిడిపిఒ రంగలక్ష్మి

చిన్నబగ్గకాలనీలో పోషణ్ పక్వాడ్

ప్రజాశక్తి-సీతంపేట

మండలంలో చిన్నబగ్గ కాలనీలో పోషణ్ పక్వాడ్ ముగింపు కార్యక్రమాన్ని బుధవారం ఐసిడిఎస్ సిడిపిఒ రంగలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వెయ్యి రోజుల్లో బిడ్డకు ఎలాంటి ఆహారం అందించాలో అవగాహన కల్పించారు. అంగన్వాడీ కేంద్రాల్లో అందించే పౌష్టికాహారం గురించి వివరించారు. కార్యక్రమంలో సూపర్వైజర్లు మిస్సమ్మ, జియో బేగం, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా లెనిన్ జయంతి

ప్రజాశక్తి-పార్వతీపురం

రష్యా సోషలిస్టు విప్లవ రథసారథి లెనిన్ 155వ జయంతి, సిపిఐ(ఎం.ఎల్) న్యూడెమోక్రసీ 56వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆ పార్టీ ఆధ్వర్యాన స్థానిక వర్తక కళాసీ సంఘం భవనంలో బుధారం నిర్వహించారు. ఈ సందర్భంగా న్యూడెమోక్రసీ నాయకులు ఎం.గోపాలం మాట్లాడుతూ దేశంలో ప్రజల మౌలిక సమస్యలు కమ్యూనిస్టు పార్టీ ద్వారా పరిష్కారం అవుతాయని చెప్పారు. ఈ సభలో పిఒడబ్ల్యు నాయకురాలు రమణి, ఇఫ్టూ నాయకులు సర్వేశ్వరరావు, అరుణోదయ నాయకురాలు జయలక్ష్మి పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికుడు అనుమానాస్పద మృతి

ప్రజాశక్తి -భామిని



మృతిచెందిన భీముడు

తాలాడ గ్రామానికి చెందిన పంచాయతీ పారిశుధ్య కార్మికుడు గొర్లె భీముడు(52) అనుమానాస్పద స్థితిలో మతి చెందాడు. గొర్లె భీముడు మంగళవారం ఎప్పటికీ ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు వెతికారు. వంశధార నది తీరంలో భీముడు అచేతనంగా పడి ఉండడం, శరీరంపై గాయాలు ఉండడంతో కుటుంబ సభ్యులకు సీతంపేట ఏరియా హాస్పిటల్ తరలించారు. ఈ క్రమంలో భీముడు మరణించాడు. భీముడి భార్య భారతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ అనిల్‌కుమార్ తెలిపారు. భీముడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

చెత్తబుట్టలు పంపిణీ

ప్రజాశక్తి -సీతానగరం

మండలంలోని పెదంకలాం గ్రామస్తులకు చెత్త సేకరణ కోసం ప్లాస్టిక్ బాకెట్లను బుధవారం గ్రామ సర్పంచ్ బలగ శ్రీనివాసరావు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి గౌరీశ్వరి, వార్డు మెంబర్లు పాల్గొన్నారు.

పాఠశాలకు కొత్తగా గేటు

ప్రజాశక్తి-సీతానగరం

మండలంలోని నీలకంఠాపురం ప్రాథమిక పాఠశాలకు నూతనంగా గేటు ఏర్పాటు చేశారు. సర్పంచ్ బుడితి శ్రీనివాసరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి.కూర్మినాయుడు ఆర్థిక సహకారంతో ఈ గేటు ఏర్పాటు చేశారు.